(8)
132/1940 ఇసం 219 S/NO 34
1431/13414
OFFICE OF THE ... MADRAS 13 MAY 1940

# ఆదిఆంధ్రప్రభోధము.

—ఐకమత్యమే బలము—

శంకరాభరణరాగము—ఆదితాళము

("హరినామంబే పరమధనంబీ ఐహికమందని చూడుమురా"
అనుపాట వరుస)

1. ఐకమత్యమే బలమని తెలియుము । ఆదిఆంధ్రకుమారా!
నీకీరహస్యము తెలిసిననాడే । లోకముగడగడలాడునురా ॥ఐ॥

2. ఎన్నియుగములీ బానిసబ్రతుకున । హింతువువీరకుమారా!
కన్నుదెరచి నీజాతికష్టముల్ । కడదేర్పనుమేల్కోరా! ॥ఐ॥

3. మానవుడవైన మానవునిగనిను । భావించరు హిందువులు
మానవపౌరుషములున్నయెడలనిక । ప్రపంచమునకు జూపుమురా ॥ఐ॥

4. మృగములకంటెనుతక్కువగానిను । హిందూసంఘముజూచునురా! జగతిని "నేహిందువుడనుగానని" । శౌర్యమునుతోడనుజాటుమురా ॥ఐ॥

5. మలమూత్రాదులకంటెనీచముగ । హిందువులునినుజూతురు
రా కులతత్వములతోగూడినహిందూ । మతమేమనగర్భశ
త్రువురా ॥ఐ॥

6. ఘనముగదేశంబునుపోషించెడి । కష్టజీవివిగదరా!
కడజాతివాడవనుచుద్రోహులు । కడకునిన్నుద్రోసిరిరా ॥ఐ॥

7. ఎంతకాలమీస్థితిభరియింతువు । ఇకమానవహక్కులకై
శాంతియుతంబగుధర్మయుద్ధమును । శౌర్యముతోసాగింపు
మురా ॥ఐ॥

8. నడుముగట్టిరంగమునకువచ్చిన । గడగడవణకునుజగము । గడి
యలోనెఅస్పృశ్యతతొలగును । సమానహక్కులువచ్చును
రా ॥ఐ॥

9. పేదవాడననిభయమొందకునీ । ధైర్యబలంబులదలపుమురా
ఆదరించి, బెదరించిభాగమును । పంచుకొనుముసమయ
మురా॥ ఐ॥

10. ధర్మయుద్ధమునజచ్చినవారికి । దైవముస్వర్గమునిచ్చునురా
కర్మమునీదనిమోసపోకుము । కర్మముగాదిదిమర్మమురా
॥ఐ॥

—✱ ఆత్మగౌరవములేని బ్రతుకెందుకు ? ✱—

జంఝూటి—ఆట

("పరువుపరువునరండోయ్" అనుపాటవరుస)

1. ప్రాణములర్పించండోయ్ । మనజాతిస్వాతంత్ర్యమునుసంపా
దించుటకై ॥ప్రా॥



మానముపోయిన । ప్రాణములెందుకు ?
బానిసలమై । బ్రతుకుటింకెందుకు ?
మానవహక్కుల । బడయుటకొరకు ॥ప్రా॥

2. పదిమందితోమనల । పడవనెక్కనివరు
పదుగురతోమనల । బండెక్కనీయరు
అధమాధములజేసి । బెదరించుచున్నారు ॥ప్రా॥

3. నడివీధులందున । నడువగనీయరు
బడిలోకిగుడిలోకి । అడుగుపెట్టనివరు
గడుసుతనముచేత । గదుముచున్నారు ॥ప్రా॥

4. నూతులందుననీరు । తోడగనీయరు
నాటకశాలులో । ఆటకకరతురు
చీటికిమాటికి । చెండాడుచున్నారు ॥ప్రా॥

5. కాఫీభోజనశాలల । కడకురానీయరు
ఏపనికైనను । దాపుజేరగనియరు
ఆపదలన్మంచి । కాపాడగరారు ॥ప్రా॥

6. క్షౌరశాలలకడకు । జేరనీయరు
ఘోరకష్టములందు । గూల్చుచునుందురు
గౌరవముగమనను । బ్రతుకసహించరు ॥ప్రా॥

7. మనలోనేమనకు పా । ర్టీలుకల్పిస్తారు
విడదీసిమనలను । పడద్రోయుచుందురు

ధనజ్ఞానబలముచే । జయమొందుచున్నారు,

8. పరులనమ్మిమనకు । మార్గము లేదింక
మనకువిముక్తి । మనలోనేకలదింక
సరగునమీరెల్ల । సంఘములోజేరి ॥ప్రా॥

## — సంఘబలమే జాతిబలము —

నాదనామక్రియ — ఆట

1. కదలిరండిసోదరులారా । మనజాతివృద్ధికి
కట్టుబాటులుచేయవలెనండి ॥క॥
కదలిరండి ఆదిఆంధ్ర । సంఘము లేర్పరచవలెను
ముదముతోముందుకువచ్చి । ముక్తిమార్గము చూడవలెను ॥క॥

2. సంఘమంటే తెలిసికొనుమన్న । పదిమందిసభ్యులు
చేరియుండుటెసంఘముగునన్న
సంఘనియమావళికిలోబడి స్వార్థమన్నదివిడిచిపెట్టి
సంఘనిధిని జేర్చిజాతి । కొఱకుత్యాగము చేయవలెను ॥క॥

3. గ్రామసంఘముబలపడవలెను । గ్రామమునపూర్తిగ
కలహములునశియించిపోవలెను
ప్రేమతల్లీబిడ్డలవలె । మెలగవలెనందరునుమనకది
క్షేమకరమగునగ్రజాతులు । చీలదీయ లేవుమనలను ॥క॥

4. గ్రామపెద్దలశ్రద్ధకావలెను । గ్రామమునకక్షలు
కలగజేయుటమానవలెనన్న



రామకుంటీఉత్సవాలకు । గ్రామనిధినిపాడుచేయక
ప్రాతపద్ధతివిడిచిమంచి । మార్గమునుచేబట్టవలెను ॥క॥

5. కులతగవులవల్లనేమనము । కోర్టులకెక్కి
కూలబడుచున్నాము, అదినిజము
కలహములుగ్రామమునవచ్చిన । పెద్దసంఘముతీర్పునకును
బద్ధులమైఉండవలెను । బాగుపడుటకుమార్గమిదియె ॥క॥

6. తప్పులొప్పులువేసిసొమ్ము । తాగుడుకుపెద్దలు
తగలబెట్టుటమానవలెనుసొమ్ము
తప్పకసంవత్సరమునకు । వంద లేక రెండువందల
గొప్పనిధినిజేర్చిజాతి । మెప్పుపొందవలెనుగ్రామము ॥క॥

7. రామకుంటీఉత్సవములకును । పెద్దలుసొమ్ము
కర్చుపెట్టుటమానవలెనండి
గ్రామమునకత్యవసరంబగు । మరుగుభూమి, నూతి, చెరువు
కాపురంబునకవసరంబగు । స్థలములనుకొనవలెనుదానితో ॥క॥

8. ఒక్కగ్రామముచిక్కులోబడిన । ఆకష్టమునుమనజాతిఅంత
పంచుకొనవలెను
తక్కినగ్రామములుతోచిన । ధనముధాన్యమునివ్వవలెను
జనసహాయముకోరితేమన । యువకులందరుసిద్ధపడవలె ॥క॥

9. కష్టమొచ్చినవెంటనేమనము । అంతటనుసభలు
జరిపిసంగతిచెప్పవలెనండి

గవర్నమెంటుకువ్రాయవలెను । పత్రికలప్రకటించవలెను
నష్టపడినవారికిమన । సానుభూతిచూపవలెను ॥క॥

10. గ్రామసంఘము, ఫిర్కాసంఘములు । అటుపై జిల్లా
రాష్ట్రసంఘాల్ దేశసంఘముల్
శ్రద్ధతోనిర్మించిజాతి । సేవచేయవలెనుమనము
జాతిబలమేసంఘబలము । సంఘబలమే జయముగూర్చును
॥క॥

—। వేయిమంది గాంధీలైనను మనలను బాగుచేయలేరు.।—

జింగ్లా—ఆది

("లేరా। యేరా। నిదురలేరా। హరిజనవీరకుమారా" అనువరస)

1. లేరా ! రారా ! నడుముగట్టర ! ఆదిఆంధ్రకుమారా !
ఎంతకాలమీ బానిసబ్రతుకు భ । రింతువుభారతభూమిన్
ఆత్మగౌరవములేదానీకు ? మానవజన్మముకాదా ? ॥లేరా॥
2. అంటరానివారమనుచుహిందూ।సంఘముమనలనుగెంటెన్
ఆదినిభారతభూమినిమనమే । పాలించితిమదినిజము ॥లే॥
3. కర్మముచే మాలలమైతిమని । కల్లలుకల్పించుమురు
కర్మముగాదు, ధర్మముగాదు।మర్మమనియెరుగుమురా ॥లే॥
4. వర్ణాశ్రమధర్మములందురురా । ప్రపంచమున లేని
వర్ణాశ్రమధర్మములిచ్చట । ఏవిధముగవచ్చెనురా ? ॥లే॥
5. హరిజనులని పంచములని । పేరులుపెట్టుదురురా



పేరుమార్చిన అంటుపోదుర । మనసులుమారవురా ॥లే॥
6. వేయిమంది గాంధీలుఅంటును । తొలగించలేరురా
నీవుతలంచిన, నడుముబిగించిన । నిల్వదునిమిషమురా। లే।
7. పరులెవ్వరు ఈ అంటుదోషమును । తీసివేయలేరురా
భారమునీపై పడియున్నదిరా। ప్రాణములర్పించుమురా॥లే।
8. పేదరికముచే పిరికిపందవై । పడియుంటివింతవరకు
మానవహక్కులు పొందుటకైనీ। శక్తినిజూపుమురా॥ లే।

ఆదిఆంధ్రుల అమాయకత్వము-సవర్ణుల కఠినహృదయము.

మాయామాళవగౌళ—ఆట

("అత్తకొట్టె మామకొట్టె" అనుపాటవరుస)

1. ఆదిఆంధ్ర మేలుకోరా ! సక్రమాందోళనచేయర
నీదుకష్టమునీకు దక్కదురా । ఓ
సాధుచరిత ! దేశమునకా । ధారమైనవాడవీవేరా॥ ఆ।
2. పొలములోన, పనులుచేసి । పొట్టకన్నము లేకమాడి
కుక్కమంచములోన రాత్రంత ।
చిక్కిపోయిన బిడ్డలతో। చిక్కులెన్నో పొందుచుందువురా
॥ఆ।
3. రాత్రియనక, పగలనక । వర్షమనక, చలియనక
క్షేత్రములను దున్నుచుందువురా । ఈ
చిత్రమేమొ నీకుతగిన । భత్యమివ్వరు రైతులయ్యయ్యో
॥ఆ॥

4. పాములనక, తేలులక । గుట్టలనక, పుట్టలనక
నీరుగట్ట నేగుచుందువురా । నీ
భార్యవిడిచి కుప్పవద్ద । రాత్రియంత కాచియుందువురా ॥ఆ॥

5. నీవుపొలము దున్నుచుందువు । నీకుభార్య ఊడ్పుఊడ్చును
నీదుబిడ్డలు పశులకాపరులు । హా
ఇంతచేసిన రైతుమనసు । కరుగదేమి రాయికాబోలు ॥ఆ॥

6. నీరుకట్టు వద్దమీరు । బుర్రపగుల గొట్టుకొందురు
రైతుమాటలె నమ్ముచుందురు । ఆ
రైతుమిమ్ము తేలనివ్వడు । రైతుదోపిడి చేయుచున్నాడు ॥ఆ॥

7. పిచ్చకుంచముతోను కూలి । ఇచ్చిమిమ్ము చంపుతారు
గాదులన్ని నింపుకొంటారు । హా!
కడుపునిండ కూడునీకు । కలుగదయ్యెను ఏమికర్మమురా ॥ఆ॥

8. కూలిచేసిన రోజులోనే । కూలియివ్వడు రైతునీకు
కొన్నిరోజులు త్రిప్పుతాడురా । హా!
బొంకులాడి, కొంతధాన్యము । జంకులేక తీసివేయునురా ॥ఆ॥

9. అప్పులిచ్చి, పెండ్లి జేసె । గొప్పఋణము పెంచుతాడు
అప్పుతీరదు, చిత్రమిదియేరా । ఈ



అప్పునీకు, బిడ్డలునుమరి । మనుమలందరు తీర్చలేరయ్యో ॥ఆ॥

10. అప్పుకొరకు, కూలిబాపతు । కొంతధాన్యము తీసివేయుచు
తప్పులెక్కలు వ్రాయుచుందునురా । ఆ
గొప్ప రహస్యము । నీకు తెలియదు । నోటుపై చెల్లుపెట్ట
మనవేరా? ॥ఆ॥

11. ధాన్యమడిగితె, అమావాశ్య శుక్రవారము, వీలులేదని
తరిమివేసి । మార్చివేయునురా ! నీ
ఆకలిబాధను రైతు । అడగడేమి? తెలిసికొనవేల? ॥ఆ॥

12. నీదుబలము, నీదురక్తము । నీదుశక్తి, నేర్పువలన
పీల్చిపిప్పి చేయుచున్నాడు । ఆ
రైతునీకు, పోషకుడని । మోసపోవుచుంటివయ్యయ్యో ॥ఆ॥

13. నీవునీదు, భార్యబిడ్డలు । మాడిచచ్చిన, రైతుకేమి?
వానిసుఖమే । వానిలక్ష్యమురా । ఓ
కూలివాడ, తెలిసికోరా।నీదుసుఖము । రైతుకోరడురా ॥ఆ॥

14. కూలివాడు, పాడియావు । రైతులందరు, గొల్లవారు
పాలుపితుకు, చున్నారయ్యయ్యో । నీ
బిడ్డమూతి, బిగియగట్టి । వారిబిడ్డల, సౌఖ్యముకొరకు ॥ఆ॥

## త్యాగముచేయనిజాతికి భోగములేదు.

పపాడి — ఆది.

("నమ్మినవారిని మోసముచేయుట న్యాయముగాదర
రఘురామా" అనుమాదిరి)

1. త్యాగముచేయని జాతిసౌఖ్యము । భోగములేదుర సోదరా!
భాగ్యముస్వేచ్ఛ కావలెనంటె । త్యాగముచేయర
సోదరా ॥త్యా॥

2. దేశము పోషించుటకీవెంతో । శ్రమపడుచుంటివు సోదరా!
నీ స్వేచ్ఛాసౌఖ్యములను కోరవు । ఏమిచిత్రమిది సోదరా!
॥త్యా॥

3. పరులను బాగుచేయుటకొరకే । బలియగుచుంటివి సోదరా!
పరమపావనమగు నీ జాతిన్ । మరచితివేలను సోదరా!
॥త్యా॥

4. క్రూరులబారినుండి జాతిని రక్షించుటకిది సమయమురా
భార్యలన్ విడిచియు పరుగున । రంగమునకు రావేమిరా?
॥త్యా॥

5. ఆదియాంధ్ర యువకులరక్తము । గోరుచున్నది మనజాతి
ఆత్మగౌరవము లేనిబ్రతుకు । కంటె మరణముమేలురా
॥త్యా॥

6. ఏనుగులను మచ్చికచేసెదవు । ఎద్దుల పోతుల నణచెదవు
హిందూసంఘము, నకు బానిసవై । ఉండుట యేమి
ధర్మమురా? ॥త్యా॥



7. తెల్లదొరల సైన్యమునందు । చేరియుద్ధములు చేయునపు
నల్లదొరలు పన్నినమాయ । శృంఖమును ద్రెంచలేవ
టరా? ॥త్యా॥

8. జాతినిర్మాణముచేయుట మనకు । శరణ్యమోయి సోదరా!
జాతి నుద్ధరించుటకు । సర్వము దారబోయుమురా ॥త్యా॥

## రైతుల దోపిడి విధానము—కూలీల బలహీనత.

హిందూస్థాని ముఖారి—ఆది.

["నారాయణ గోవిందా హరినీనామము స్మరియింతున్"
అనుమాదిరి.]

సోదరులారా! రైతులదోపిడి । విధము తెలిసికొండి, మీరు
మీ దారిద్ర్యమునకు వారే । బాధ్యులు నమ్మండి నిజ
ము। సో।

2. మన కష్టమునకు తగినకూలి । యజమానులివ్వరు, చిత్రం
మన బలహీనత, మనపేదరికము । కనిపెట్టిరివారు, వేగమే।
సో।

3. కూలీలందరు ఏకముగారని । తెలిసికొన్నారు, రైతుల్
కూలీలందరు కూడియుంటె । కూటికికరువేది? చూడు। సో।

4. పిచ్చకుంచముల తోడనుకూలి । ఇచ్చిచంపుతారు మనలన్
హెచ్చుగ పొల్లుపొట్టునుజేర్చి । కడుపునిండ నీయరు మన
కు। సో।

5. అప్పులిచ్చి, నాములుగట్టి । తప్పులెక్కవ్రాసి, రైతు

ఎప్పటికప్పుడె మనరక్తమును । పీల్చివేయుచుండెన్, నిజ
ము॥ సో॥

6. చేసినకూలి మనకొకసారి । చేతికివ్వబోడు, చూడు
అప్పుడప్పుడు ఇచ్చియుకొంత । అపహరించుతాడు, రైతు॥
సో॥

7. ఇష్టమువచ్చిన యప్పుడుకూలి యిస్తానంటారు, మనదు
కష్టము చూడరు, ఆకలినెరుగరు । గ్రామలనిండ ధాన్యము
న్నన్॥ సో॥

8. భర్తయు భార్యాబిడ్డలు దినము । పనిచేసినగాని, చూడు
అప్పుతీరదు, కడుపునిండదు । గొప్పచిత్రమయ్యా, బాబు॥
సో॥

9. రోగముఃవచ్చిన, కార్యమువచ్చిన । నాగతప్పడయ్యా, రైతు
రాత్రింబవలు పనిచేసినను । మెక్కువివ్వబోడు, కూలి॥
సో॥

10 దినమున కిన్నిగంటలనెడి । తీర్మానములేదు, పనికి
ఎప్పుడురైతు, పిలిచినప్పుడె । వెళ్ళవలెను పొలము, మన
ము॥ సో॥

11. పెండ్లిరోజున సహితం పాలేరు । పేడతీయవలెను, తప్పదు
ఎంతచేసినన్ రైతుకుమనపై । కనికారములేదు, చిత్రం॥
సో॥

12. కడుపునిండ, భోజనముఃంటె । లోబడమని మొచ్చి, రైతు
గడుసుతనముగ, కూలినివ్వక । కడుపుమాడ్చుచుండెన్
మనల॥ సో॥



13 మనకష్టమునకు తగినకూలి । మనకివ్వక పైగా, తానే
మనలన్ బెంచుచు, నూటినని । గర్వమొందుచుండెన్,
రైతు॥ సో।

14. రైతుసంఘముల్ బలపడియున్నవి।రైతుమేలుకొరకు, నేడు
కూలీసంఘము, బలపడవలెను । కూలిహెచ్చుకొరకు
వేగన్॥ సో।

ఆదిఆంధ్రులు హిందువులుగారు—వారికి ప్రత్యేకమతము కలదు.

భ్యాగ్ — ఆది.

["జయ్ శంకరాయని రండి । జన్మహక్కులను గోరండి"
అనుమాదిరి]

ఓ ఆదిఆంధ్రకుమారా! మన । మతముతెలిసికోరా
హిందూమతమువేరు । మన । కెల్లవేళల పోరు
హిందువులమని మనము । భా । వించుట లోపమ్మురా ఓ।

2. మనరాజుననుజంపి । మన । రాజ్యమపహరించి
ఘనులైనవారికి నేడు । మొక్కు । చుంటిమెంతయు
కీ॥ ఓ।

3. శ్రీరాముడు కృష్ణుడు । మన । వీరులనొన్నసముచే
సంహరించి యార్యులరాజ్యం । స్థాపించినారది ఘోరం।
ఓ।

4 నాఁడు నుండి మనము । బా । నిసలమైపోయాము
మన పౌరుషంబుపోయె । మన రాజ్యము నశియించె। ఓ।

5. ఆ రావణుడు మనరాజు । నరకాసురశంభకుడు
మన వీరులయ్యో వారిన్ । చంపీన విధముచూడుము॥ ఓ॥

6. ఒక్కమతమువారు । సో । దరులవలె నుందురు
హిందువులమైన । మన । కెందుకు వెరివచ్చె॥ ఓ॥

7. బ్రాహ్మక్షత్రియులతో । ఆ । కాపు కమ్మలతోను
సంబంధము మనకేది । హిం । దువులము మనమైన॥ ఓ॥

8. భోజనముల వద్ద । శుభ । కార్యములయందు
మనకంపు పనికిరాదు । పై । జాతిసోదరులకు॥ ఓ॥

9. ఏ మతమునందుగాని । ఈ । జాతిభేదము లేదు
హిందూమతమునందు । ఈ । జాతులెట్లు వచ్చెన్॥ ఓ॥

10. జనసంఖ్యకోసము మనలన్ । హిందువులనుచున్నారు
మనపేరుచెప్పి వారు । ఫల । మంత తినుచున్నారు॥ ఓ॥

11. ఎంతకాలము మనము హిందువుల మనుకొందుమొ
అంతకాలము మనకు । మో । క్షుంబులేదు జగతిన్॥ ఓ॥

12. సాంఘీక రాజకీయ । స్వాతంత్ర్యము కావలెనా?
ప్రత్యేకమతమని చాటు । ప్రాపంచము గుర్తించున్॥ ఓ॥

## ఆదిఆంధ్రులకు స్వేచ్ఛనివ్వని హిందువులకు స్వరాజ్యము వచ్చునా?

ముఖారి — ఆది.

["సీతా రాముల కళ్యాణంబు చూచివస్తాము" అనుమాదిరి.]

ఏడుకోట్ల ప్రజలము దేవ! ఆదియాంధ్రులము॥ ఏ॥



ఆకలిచేత, అడలిచచ్చిన । బట్టలులేక, బాధలుపడిన
గృహములులేక, కేకలువేసిన । నూతులులేక, దాహమైన
మనుగుప్రదేశము, సున్నమైన । రోగముచేత, చిక్కులుపడిన
మావంక జూచు । మాన్యులు లేరు॥ ఏ॥

2. పంటలన్ని, పండించెదము । రైతులగాదు, లందునింపు
దుము । ఇచ్చినకూలికి, సమ్మ్రతింతుము । వస్తులనెప్పుడు,
పనుచుందుము । రైతును బాబు, గారందుము । రైతు
భార్యను, అమ్మా యందుము । అంటగూడదని । గెంటి
నారు మము॥ ఏ॥

3 దేశములోన, లేశమైనను । స్వేచ్ఛనుమాకు, ఇవ్వనొల్లరు
ఎదిరించితే, బెదరించెదరు । కష్టాలెన్నో కలిగించెదరు ।
బానిసబ్రతుకు, బ్రతకమనేరు । అన్నివిధముల, నణచి
వేసెదరు । నిలిచి నీళ్ళు । త్రాగనీయరు॥ ఏ॥

4. స్వేచ్ఛకొరకు, యత్నముచేసిన । చేలగట్టులన్ నడువగ
నీయరు । కూలిపనికి, పిలువబోరు । చాకలి బట్టల నుతక
నీయరు । ఆహారముల, నమ్మనీయరు । అన్నికులములు,
ఒకటౌతారు । ఇంతఘోరము । కలదా భువిలో? ॥ ఏ॥

5. స్వరాజ్యమిప్పుడె, కావలెనంట । తెల్లవారిని, తిడతారంట
స్వరాజ్యమునకు, దేశమంత । సిద్ధమయిందని, చెపుతారంట
జాతిభేదములు, పోయాయంట। అంటుదోషము, లేనేలేదట
వారుస్వేచ్ఛను । పొందాలంట। ఏ

6. వారికిరాజ్యం, కావాలంట । మాపని పిమ్మట, చూస్తారంట
స్వరాజ్యమునకు, జాతిభేదములు । అడ్డుగావని, చెపుతా

రంట । కాళ్ళక్రిందమేము, ఉండాలంట । ముందుగమాకు,
స్వేచ్ఛనివరట । స్వరాజ్యమొస్తే, భేదములన్ని । వాటి
యంతట, పోతాయంట । నోరుపెద్దదని।గదుముతారు॥ ఏ॥

7. మాలల నణచుట, మానండంటె । ఎక్కడలేని, కోపము
వచ్చును । స్వరాజ్యమడిగితే, తెల్లవారికి । వీరికి వలెనే,
కోపమురాదా ? ఏడుకోటుల, పంచములను । వెలిబెట్టిన
హిందువ్రలిపుడే । స్వరాజ్యమునకు, అర్హులుగారు । తెల్ల
దొరలు, చెప్పేదిదియే । కాదనివీరు । వాదించేరు॥ ఏ॥

8. లాటీదెబ్బలు, తినగవచ్చు । చెరసాలలకు, వెళ్ళగవచ్చు
ఫిరంగిదెబ్బలు, భరించవచ్చు । సంకెళ్లైన, సహించవచ్చు
ఉరికంభములకు, ఎక్కగవచ్చు । సవర్ణజాతులు, పెట్టు
కష్టముల్ । భరించలేము । పంచములము॥ ఏ॥

9. గాంధీగారు, యెత్తులువేసి । హిందుమెజారిటి, నిలిచి
యుండన్ । పంచములకు, సవర్ణులకు । సమిష్టియెన్నిక,
పద్ధతిగూర్చెన్ । పూనాప్యాక్టను, ఉరిత్రాడును మా । కం
ఠములకు, బిగించినాడు । కీలుబొమ్మలన్, మెంబరుపద
వికి । తీసుకవచ్చి, మమ్ములనిప్పుడు । రాజకీయ బా ।
నిసలజేసిరి॥ ఏ॥

10. హిందూసంఘము, ఎంతవేగము । స్వేచ్ఛనుమాకు,
ఇచ్చితె యంత । శీఘ్రము మేము, స్వరాజ్యమునకై ।
ముందుగ ప్రాణము, లర్పించెదము । స్వరాజ్యమంటె,
హిందూరాజ్యం । కాదనిపించి, అందరికంను । భాగము
కావలె । సౌఖ్యము రావలె॥ ఏ॥



వ్యక్తులు లాభంపొందినంతమాత్రాన జాతిఅంతా
బాగుపడినట్లు తలంచరాదు.

కమాచి — ఆట.

["మరువకు డార్యులార పంజాబువధలు" అనుమాదిరి]

మరువకు మాదిమాంధ్ర । మనజాతిస్థితి॥ మ॥
పరులు బాగుచేయుదు । రను భ్రమలు మానుము
మన జాతిస్వేచ్ఛకై మనమె పోరాడవలెను॥ మ॥

2. ఒక్కరిద్దరికి । యెంగిలిమెతుకులు
చిక్కినంతనె జాతి । అభివృద్ధి పొందదు॥ మ॥

3. మడిమాన్యముల నగ్రి । జాతులుపొంది
కుడుములతో మనల । తృప్తిపడమంటారు॥ మ॥

4. గొప్పభాగము వారు । పొందుచు మనకు
పిప్పినిచ్చి అదియే । గొప్పనిచెప్పేరు॥ మ॥

5. ఉద్యోగములకె మన । ఉద్యమమంటారు
ఉద్యోగములకొరకె । స్వరాజ్యం కోరేరు॥ మ॥

6. మంత్రి పదవులకోసం । యెత్తులు పన్నేరు
మాటలతో మనల । తృప్తిపడమంటారు॥ మ॥

7. చేసేది స్వల్పము । చెప్పేది కొండంత
మోసముచేసేరు । మొసలకన్నీళ్ళతో॥ మ॥

8. మన జాతిబలము । మన యైకమత్యము
కనినప్పుడెవారు । భయపడుదురు మనకు॥ మ॥

9. మన సంఘబలము । జాతినిర్మాణము
చూచినప్పుడు గవర్న । మెంటు మేలుచేయును॥ మ॥

10. వ్యక్తు లచ్చటచ్చట । లాభముపొందిన
జాతియంతయు బాగు । పడినట్లు ఎంచకు॥ మ॥

11. ఎప్పుడు జాతికి । స్వేచ్ఛచేకూరునో
అప్పుడె మనమంత । ధన్యుల మగుదుము॥ మ॥

దేశంలో రాజకీయ ప్రాముఖ్యతకోసం హిందూనాయకులు
వేసేయెత్తులు.

కళ్యాణి — ఆట.

["ఏమిజన్మము, యేమిజీవనమో ఈమాయకాయము"
అనుమాదిరి.]

ఏమిచిత్రము, యేమిమర్మమురా ? పంచమజాతి
ఎట్లువచ్చెను ? ఏమి తెలియదురా॥ ఏ॥

ఏమిధర్మము, ఏమిమతమిది ? ఏమిశాస్త్రము, ఏమిన్యా
యము ? స్వామిని దూషించవలెనా ? స్వార్థపరులను
తిట్టవలెనా ? ॥ ఏ॥

2. దండిగను భూ, మండలంబున । అందరివలెనె
తల్లికడుపున పుట్టినాముర
అందరము హిందూమతస్థుల । మనుచువారే చెప్పుచుం
దురు । ఒక్కమతము వారికి యీ । అంటుదోష మెట్లు
వచ్చెను ? ॥ ఏ॥



3. భోజనావివాహములందు । వారికి మాకు
పూర్తిగా సంబంధములేను
ఎచ్చటలేని సంపర్కము । ఎట్లువచ్చెను మతమువద్ద ?
అచ్చటైనను మేమువారు । ఒక్కగుడిలో మ్రొక్కరాదు॥ ఏ॥

4. ఎన్నికలలో వారికిమాకు । సమిష్టియెన్నిక
యేర్పాటులుండవలెనంట
అన్నిచోట్లను దూరముగా । తరిమివేయుచున్నవారికి
ఎన్నికలందును మనతో । ఎట్లుసంబంధమ్మువచ్చెను ?॥ ఏ॥

5. హిందువుల మెజారిటీకొరకే । ఈ యెత్తులన్ని
ఇప్పుడిపుడు పన్నుచున్నారు
హిందువుల హృదయములు మాయెడ । నించుకైనను
మారలేదు । చెట్టుపేరు చెప్పి కాయ । లమ్ము కొరకే
యెత్తులన్ని॥ ఏ॥

6. మాకు వేరేయెన్నికలు కోరెన్ । మానాయకుండు
ఘనుడు డాక్టరంబేద్కరు
గాంధియెత్తు పన్నిమనలన్ । గంగలో దింపినాడు
పూనప్యాక్టను కత్తితోమన । గొంతుకలను గోసినాడు॥ ఏ॥

7. పూనాప్యాక్టును పొగడుచున్నారు । కాంగ్రెసువారు
గాంధియే మనదేవుడందురు,
గాంధిని బ్రతికించిన మన । నాయకుల పేర్లెత్తబోరు
మాయజేసి మనలనింకా । మాడ్చివేయ జూతురకటా!॥ ఏ॥

8. పూనాప్యాక్టుకు ముఖ్యకారకుడు । యం. సి. రాజా
బోరుబోరును యేడ్చుచున్నాడు
దీనిమర్మము తెల్పవలెనని । గాంధిగారినడిగెనతడు
ఏరుదాటి తెప్పగాల్చిన । పగిదిగాంధి చేసినాడు॥ ఏ॥

9. పదవులనేడి యెరలుజూపిరిరా । మాలోమాకు
పార్టీలు పెట్టినారురా
స్వార్థపరులచేత పూనా । ప్యాక్టును పొగడింపజేతురు
కాంగ్రెసే మన రక్షణంబని । కల్లలను బల్కింపజేతురు॥ ఏ॥

10. రొట్టెముక్కలు వేయుదురు మనలో । కొందరికి వారికి
ప్రక్కతాళము వేయుటకొరకు
మొత్తమున మానోరునూసి । భాగమంతయు వారేపొంద
నిట్టియుక్తులు పన్నుచున్నా । రింక మేము మోసపోము॥ ఏ॥

ఆదిఆంధ్రపతాకము.

ఆనందభైరవి—ఆది.

ఎగరాలి, ఎగరాలి । మనజాతిజెండా
యుగయుగాలవరకు । జగతి మనజెండా॥ ఎ॥

2. ఆది నీదేశమున్ । పాలించినాము
ఆదియాంధ్రులమని । పేరొందినాము॥ ఎ॥

3. మనపూర్వ పౌరషం । మనజాతి ధర్మము
వేయినోళ్ళనుజాటు । జగతి మనజెండా॥ ఎ॥

4. మనవీరులన్ దలచి । ఈ పతాకమునకు
వంగివంగి నమ । స్కారముచేయుము॥ ఎ॥



5. ఈపతాకము కొరకు । మనజాతి యువకులు
ప్రాణత్యాగమునైన । చేయాలి రావాలి॥ ఎ॥

6. ఈ పతాకముకొరకు । రావణుడు నరకుండు
ప్రాణమర్పించిరి । స్వర్గమున్ జేరిరి॥ ఎ॥

7. జాతిస్వేచ్ఛను కోరు । సైనికులందరు
జయభేరి మ్రోగించి । ముందుకు నడవాలి॥ ఎ॥

ఆదిఆంధ్ర యువకులకు జాతిపిలుపు.

హిందూస్థాని — ఆది.

["శ్రీరామ రామరామ శ్రితభక్తజనస్తోమ" అనుమాదిరి.]

ఆదియాంధ్ర యువకులారా । అఖండశూరులారా!
మోదముతో మనజాతి । సైన్యములో జేరండి॥ ఆ॥

2. మనజాతి ముక్తిబొందన్ । యువకుల రక్తముగోరెన్
ధర్మయుద్ధమున మనమంత । ప్రాణంబుల నీడుదము॥ ఆ॥

3. యుగయుగములనుండి । పగబట్టియు మనజాతిన్
తెగటార్చుచున్న హిందూ । సంఘముతోడన్ పోరన్॥ ఆ॥

4 మనరాజ్య మపహరించి । అంటరాని వారిగజేసి
హింసించుచున్న హిందూ । సంఘము నెదుర్కొనవలెను॥
ఆ॥

5. పులిపిల్లలయ్యు మీరు । మేకపిల్లలైపోయారు
తెలివొంది యికమనజాతి । దీనత్వమును తొలగింపన్॥ ఆ॥

6. ఎంగిలిమెతుకుల కకటా । వంగిసలాం చేస్తారా ?
మనజాతిస్వేచ్ఛను కోరి । రంగమునకు వస్తారా ? ॥ ఆ॥

7. రొట్టెముక్కల వలన । పొట్టనిండదు మనకు
పట్టుపట్టి మనభాగం । పంచుకొను నిమిత్తం॥ ఆ॥
8. మనదాస్యము పోవాలి । ఆత్మగౌరవము రావాలి
ఆర్థిక రాజకీయ । సాంఘిక హక్కులు పొందన్॥ ఆ॥

ఆదిఆంధ్రులు బాగుపడవలెనంటే ముందుగా తమగృహం
సర్దుకోవాలి.

ఆనందభైరవి — ఆట.

బాగుపడె విధము తెలియండి । కార్మికులారా!
ముక్తి బొందే మార్గమెరుగండి । ఆదియాంధ్రులార! ॥ బా॥
రోగములచే తిండిలేక । ఎంతకాలము బాధపడుదురు?
వేగమేమన గమ్యస్థానము । చేరుకొనుటకు త్రోవకలదు॥
బా॥

2. తగినకూలి మీరుఅడగండి । యజమానులతో
రాయభారములను జరపండి । కార్మికులారా!
రాయభారము కుదరకపోతే
కలక్టేరుదొరకువ్రాసి । న్యాయమిమ్మని అడగవలెను
ఎవ్వరేమి చేయకున్న । సమ్మెకట్టుట తప్పదండి॥ బా॥

3. కాలము మారింది వినుమన్న, మనకష్టములు
గడచిపోయే రోజుగనుమన్న



కాలముతో గొప్పవారి । మనసుమారిపోవునన్న
వూరకున్నవారికే బహు । కష్టమొచ్చును, నష్టమొచ్చును॥
బా॥

4. ఎంతరాబడి వచ్చినసుగాని । మనకూలీలు
కొంచెమైనను కూడబెట్టరు
సొంతసొమ్ము కూడబెట్టుట । గొప్పమార్గము తెలిసికొనుము
ధనముతోనే గౌరవమ్మన్న । సకలభోగము కలుగునన్న॥ బా॥

5. కల్లుసారా మానవలెనన్న । పేదవారికవియే
వల్లగాని పనులుసుమ్మన్న
ఇల్లువాకిలి శుభ్రపరచి । పేటలన్ని బాగుచేసి
స్నానసంధ్యలు చేసిసంఘు । కట్టుబాటుకు నిలువుమన్న॥
బా॥

6. మాటమాటికి భూతులాడుట । ఇకమీదమనము
మానివేయవలెను వినుమన్న
త్రాగిస్త్రీలను చితుకగొట్టుట । తగనిపనియని తెలిసి
కొనుము । ఆడవారిని తగినరీతి । నాదరించుట మనకు
శుభము॥ బా॥

7. పిల్లలను చదివించవలెనన్న । తలిదండ్రులందరు
విద్యయేమన మోక్షమగునన్న
కూలిధాన్యము కాశపడుచు । బిడ్డలను చదివించనట్టి
తల్లిదండ్రులందరికి । తప్పదు నరకంబు వినుము॥ బా॥

8. జాతిభేదము విడిపెట్టాలి । కూలీలందరు
ఒక్క సంఘమునందు జేరాలి
కల్లబొల్లి మాటనమ్మి । కష్టములలో జిక్కుకొనక
నాయమైన త్రోవబట్టి । నడిచిపోతే జయముకలుగును॥
బా॥

సమాప్తము.